సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
శనివారం । 2 । నవంబర్ । 2024



భారీ స్కోరు దిశగా 'అనంత' జట్టు

కడప నగరంలో నిర్వహిస్తున్న అండర్-14 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం అనంతపురం, విజయనగరం జట్లు తలపడ్డాయి. -8లో



అత్తింటి ముందు కోడలి ధర్నా

ఆరేళ్ల నుంచి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకున్నారు. ఆరు రోజులకే విభేదాలు వచ్చాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడి ఇంటి వద్ద ఆ యువతి ధర్నాకు దిగింది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.8/23.6

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 23.6 - 33.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు నాతియా మెహిఫిల్

కడప కల్చరల్: కడప నగరంలోని ఇబ్రహీం ఖలీలుల్లా మస్జిద్ వద్ద పవిత్రమైన గ్యార్మి షరీఫ్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం నాతియా మెహిఫిల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతదేశంలోని ప్రముఖ నాత్ ఖాన్లు హైదరాబాద్ నుంచి ఇమ్రాన్ ముస్తఫా హుసేని, ముంబై నుండి సల్మాన్ రజా అష్రఫీ తో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా పలువురు నాత్ ఖాన్లు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలకు కూడా పరదా సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు.

4 నుంచి సెమిస్టర్ల పరీక్షలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడీ కళాశాలల 2, 4 సెమిస్టర్ల విద్యార్థులకు ఈనెల 4వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలోని16 కేంద్రాలను సిద్ధం చేశామని, 16,900 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు అబ్జర్వర్లతో పాటు హైపవర్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను చదువుతున్న కళాశాల నుంచి పొందాలన్నారు.

పింఛా నుంచి నీటి విడుదల

సుండుపల్లె: మండల పరిధిలోని పింఛా ప్రాజెక్టు కుడి కాలువకు గేటు అమర్చే క్రమంలో భాగంగా.. ఏటి దిగువకు 300 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని ప్రాజెక్టు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నీటి విడుదలను శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు.

రేపు షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక


రామాపురం: స్థానిక బీసీ కాలనీలోని గురుకుల పాఠశాల బాలుర మైదానంలో ఆదివారం షూటింగ్ బాల్ సీనియర్ బాలుర జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా వైఎస్సార్ కడప షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డును తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్: 93918 35714ను సంప్రదించాలని వివరించారు.

నవోదయ ప్రవేశాలకు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: అన్నమయ్య జిల్లా నారమరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరంలో 11వ తరగతి ప్రవేశానికి ఈ నెల 9వ తేదీ వరకు గడుపు పొడగించినట్లు ప్రధానాచార్యులు యం.గీత ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య, కడప జిల్లాలలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2024-25 సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెల 9వ తేదీలోపు https://cbseitms.nic.in/2024/nvsxi11 వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష 2025 ఫిబ్రవరి 8వ తేదీ నిర్వహించనున్నామన్నారు. వివరాలకు www.navodaya.gov.in ను సంప్రదించాలని తెలిపారు.

కరువు రైతుపై కన్నెర్ర

- కరువు జాబితాలో జిల్లాకు దక్కని చోటు
- ఖరీఫ్‌లో దిగుబడి బాగా వస్తుందట
- గ్రౌండ్ ట్రూథింగ్ పేరిట అధికారుల తప్పుడు నివేదికలు
- నివేదిక వెల్లడిస్తే సమస్యలు వస్తాయన్న డీఆర్వో
- ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు



వీఎన్ పల్లె మండలం ఉరుటూరు గ్రామం వద్ద ఎండిపోయిన మినుము పంట

కడప సెవెన్‌రోడ్స్: ఖరీఫ్‌లో పదహారణాల పంటల దిగుబడి వస్తుందంటూ గ్రౌండ్ ట్రూథింగ్ పేరిట అధికారులు అంచనాలు రూపొందించి నివేదించిన ఫలితంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాలో జిల్లాకు చోటు దక్కకుండా పోయింది. దీంతో కరువు రైతులు నష్టపోవాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన నివేదికలోని అంశాలను వెల్లడిస్తే తాము సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని డీఆర్వో గంగాధర్ గౌడ్ 'సాక్షి'తో అనడం దీనికి బలాన్నిస్తోంది. పాత్రికేయులకు వివరాలు ఇవ్వాలంటూ స్వయాన ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించినా కలెక్టరేట్ డి-సెక్షన్ సూపరింటెండెంట్ జీవన్ చంద్రశేఖర్ బేఖాతరు చేయడం ఆశ్చర్యపరుస్తోంది. అధికారుల వైఖరి పట్ల రైతులు, ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు భగ్గుమంటున్నాయి. నవంబరు 5వ తేదీ జరగనున్న డీఆర్‌సీ సమావేశంలో ఈ అంశం చర్చకు రానుంది.

- జిల్లాలో ఈ యేడు ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. జూన్ మాసంలో ఎక్సెస్ రెయిన్‌ఫాల్ నమోదైంది. జులైలో 98.5 మి.మీ. సాధారణ వర్షపాతానికిగాను 55 మి.మీ. మాత్రమే నమోదైంది. అంటే ఈ నెలలో 44.2 శాతం లోటు ఏర్పడింది. ఆగస్టులో 120 మి.మీ. సాధారణ వర్షపాతానికిగాను 92 మి.మీ. వర్షపాతం నమోదై 23.3 శాతం లోటు నెలకొంది. సెప్టెంబరులో 74.7 మి.మీ.కిగాను 28.3 మి.మీ. నమోదైంది. ఇలా మొత్తం 14.1 శాతం వర్షపాత లోటు ఏర్పడింది.

నివేదిక దాస్తున్న అధికారులు

కరువు పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన నివేదికలు వెల్లడించకుండా కలెక్టరేట్ అధికారులు తొక్కిపెడుతున్నారు. ఇది వెల్లడైతే రాజకీయపరంగా తీవ్ర నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందని భావించడమే కారణంగా తెలుస్తోంది. నివేదికలోని వివరాలు తెలపాలంటూ వారం రోజులుగా 'సాక్షి' అడుగుతున్నప్పటికీ నేనెరుగ...నేనెరుగ..అంటూ తప్పించుకుంటున్నారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి, వివరాలు ఇవ్వాలంటూ డి-సెక్షన్ సూపరింటెండెంట్ జీవన్ చంద్రశేఖర్‌కు ఆదేశాలు పంపారు. ఆయన ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేశారు. డీఆర్వో చెబితే ఇస్తామంటూ మెలిక పెట్టారు. ఆయన అలా వ్యవహరించడంలో ఉద్దేశ్యం ఏమిటో తెలియడం లేదు.

డ్రై స్పెల్స్



వరుసగా 21 రోజుల పాటు వాన పడకపోతే దాన్ని ఒక డ్రై స్పెల్‌గా పరిగణిస్తారు. ఇవి పంటలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. ఖరీఫ్‌లో పెద్దముడియం మండలంలో వర్షపాత లోటుతోపాటు రెండు డ్రై స్పెల్స్ చోటుచేసుకున్నాయి. అంటే 42 రోజుల పాటు వర్షమే పడలేదంటే పంటలు ఎలా ఎండిపోయాయో అర్థమవుతుంది.

- కలసపాడు, తొండూరు, వేంపల్లె మండలాల్లో కూడా వర్షపాత లోటుతోపాటు రెండు డ్రై స్పెల్స్ చోటుచేసుకున్నాయి. ఇక పోరుమామిళ్ల, గోపవరం, అట్లూరు, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో వర్షపాత లోటుతోపాటు ఒక్కొక్క డ్రై స్పెల్ నమోదయ్యాయి. బద్వేలు మండలంలో మాత్రం డ్రై స్పెల్ చోటుచేసుకోకపోయినా వర్షపాత లోటు నమోదైంది. జూన్ 4 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు రెఫరెన్స్ పీరియడ్‌గా తీసుకున్నారు. వర్షపాత లోటు, డ్రై స్పెల్స్‌ను విపత్తుల నిర్వహణ విభాగం మ్యాండేటరీ ఇండికేటర్స్‌గా పరిగణిస్తుంది. అంటే ఒక మండలాన్ని కరువు కింద ప్రకటించాలంటే తప్పనిసరిగా వర్షపాత లోటు, డ్రై స్పెల్ నమోదై ఉండాలి.
- పంటల సాగు విస్తీర్ణం, రిమోట్ సెన్సింగ్, మాయిశ్చర్ అడక్వేట్ ఇండెక్స్, హైడ్రో లాజిక్ ఇండెక్స్‌లను ఇంపాక్ట్ ఇండికేటర్స్‌గా తీసుకుంటారు. ఇందులో పంటల సాగు, దిగుబడి, రిజర్వాయర్లలో నీటి నిల్వ వంటి వివరాలపై జిల్లాలోని ఆయా శాఖల అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తారు.

గ్రౌండ్ ట్రూథింగ్ పేరిట తప్పుడు నివేదిక

ఒక మండలంలో పంటల దిగుబడి అంచనా 33 శాతం కంటే లోపు ఉంటే ప్రభుత్వం ఆ మండలాన్ని కరువు కింద ప్రకటిస్తుంది. జిల్లాలో వరి, పత్తి, జొన్న, మినుము, కంది లాంటి వాటితోపాటు ఖరీఫ్‌లో మొత్తం 18 రకాల పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1,23,535 హెక్టార్లు ఉంది. జూన్‌లో 3,028 హెక్టార్లు, జులైలో 18,904 హెక్టార్లు, ఆగస్టులో 32,036 హెక్టార్లు కలిపి మొత్తం 53,968 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. అయితే తీవ్ర వర్షపాత లోటు, డ్రై స్పెల్స్ కారణంగా పంటల సాగు భారీగా పడిపోవడంతోపాటు సాగైన పంటలు ఎండిపోయాయి. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇలా ఉండగా, వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం ఖరీఫ్‌లో పదహారణాల పంట దిగుబడి వస్తుందంటూ నివేదికలు సమర్పించినట్లు తెలుస్తోంది. దీంతోనే జిల్లాలో ఒక్క మండలం కూడా కరువు కింద ప్రభుత్వం ప్రకటించలేదు.

కరువు మండలాలు ప్రకటించాలి

జిల్లాలో సాగునీటి పారుదల ఉన్న కేసీ కెనాల్ మినహా మిగతా మండలాలైనా కరువు కింద ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ శుక్ర వారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అధికారులను బాధ్యులను చేయాలి



జిల్లాలో రైతులు సాగు చేసిన వేరుశనగ, మినుము తదితర పంటలు నిలువునా ఎండిపోయి పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోయారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇలా ఉండగా, ఖరీఫ్ పంటల దిగుబడి భేషుగ్గా ఉందంటూ అధికారులు నివేదికలు పంపిన ఫలితంగానే జిల్లాకు కరువు మండలాల జాబితాలో చోటు లభించలేదు. ప్రభుత్వం ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టాలి. - ఎంవీ సుబ్బారెడ్డి, రైతు, ఎర్రగుంట్ల

అధికారుల తీరుతో రైతుకు అన్యాయం



ఖరీఫ్‌లో సాగుచేసిన మినుము వర్షం లేక పూర్తిగా ఎండిపోయింది. అధికారులు పంటల దిగుబడి బాగా ఉందంటూ ప్రభుత్వానికి గుడ్డిగా ఎలా నివేదించారో అర్థం కావడం లేదు. కరువు మండలాల ప్రకటన జరిగి ఉంటే ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, రుణాల రీ షెడ్యూల్ వంటి లబ్ధి రైతులకు లభించి ఉండేది. రైతులకు అన్యాయం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. - ఆదినారాయణరెడ్డి, రైతు, కోనాయపల్లె, పెండ్లిమర్రి మండలం

ముగిసిన మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన



ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్

పులివెందుల రూరల్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన విజయవంతంగా ముగిసింది. మంగళవారం బెంగళూరు నుంచి ఇడుపులపాయకు చేరుకున్న ఆయన దివంగత సీఎం వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పించి.. అక్కడ నుంచి నేరుగా పులివెందులలోని భాకరాపురంలో ఉన్న తన క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. క్యాంపు కార్యాలయంలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను కలిసి పలు సమస్యలను విన్నవించారు. రెండవ రోజు బుధవారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు జగన్ క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజా దర్బార్‌లో జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతోపాటు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు. రెండు రోజుల పర్యటన ముగించుకుని మూడవ రోజు గురువారం తిరిగి ఆయన బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఆర్‌సీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

పులివెందుల టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గురువారం ఉదయం రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్ర రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా రెడ్డి సామాజిక వర్గంలో అనేకమంది పేదలు ఉన్నారని, వారి ఇబ్బందుల గురించి, రెడ్డి రైతుల సమస్యలను వైఎస్ జగన్‌కు ఆయన వివరించారు.

పటేల్ సంకల్పాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ హర్షవర్ధన రాజు



సర్దార్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్: పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈనెల 31న 'ఏక్తా దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ సమగ్రత, ఐక్యతకు కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ సంకల్పాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు అన్నారు. మొదట సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌లతో పాటు జిల్లా అదనపు ఎస్పీ కె. ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య తదితర పోలీసు అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్‌డీఓ జాన్ ఇర్విన్, మునిసిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, డీసీఆర్‌బి సీఐ డి.భాస్కర్‌రెడ్డి, ఎస్‌బి సీఐ బి.హేమకుమార్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీసు సిబ్బంది స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు, లక్ష్య అకాడమీకి చెందిన ఔత్సాహిక పోలీస్ ఉద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణార్థం క్యాండిల్ ర్యాలీ

జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) కె. ప్రకాష్‌బాబు అమరవీరుల సంస్మరణార్థం క్యాండిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ప్రజా స్వామ్య పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు పోరాడి అమరులైన పోలీసుల త్యాగనిరతికి ఇవే మా జోహార్లు అంటూ ప్రజలు, విద్యార్థులు నివాళులు అర్పించారు. పోలీసుల అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులను ఉంచి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.



● కార్తీకం ఆరంభం

మహా శివుడికి అత్యంత ఇష్టమైన కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న శివాలయాలన్నీ కార్తీక దీప కాంతులతో ప్రజ్వరిల్లనున్నాయి. శంభో.. శివ శంభో.. అంటూ భక్తజనం పరమశివుడి పూజల్లో నిమగ్నం అవనున్నారు. ఆలయాలలో అభిషేకాలు చేసేందుకు భక్తులు పోటెత్తనున్నారు. శివాలయాలలో కార్తీక దీపాలు వెలిగించేందుకు నిర్వాహకులు ఏర్పాటు ముమ్మరం చేశారు.

- కడప కల్చరల్

ముంచుకొస్తున్న ముంపు గండం

అట్లూరు మండలం సగిలేరు నదిపై ఉన్న లో లెవెల్ వంతెనకు ముంపు గండం ముంచుకొస్తోంది. పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోమశిల బ్యాక్‌వాటర్ వంతెనపై ఒక అడుగు మేర పారుతోంది. వంతెనపై ఈ ప్రవాహం ఇంతకంటే ఎక్కువగా కొనసాగితే ఆరు పంచాయతీల పరిధిలోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోనున్నాయి. దీంతో ఆయా గ్రామాల వాసులు ఆందోళనలో ఉన్నారు.



సగిలేరు నది లోలెవల్ వంతెనపై చేరుతున్న సోమశిల ముంపు జలాలు

అట్లూరు: పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోమశిల జలాశయంలో రోజు రోజుకూ నీరు పెరుగుతోంది. దీంతో అట్లూరు మండల పరిధిలోని వేమలూరు దగ్గర సగిలేరు నదిపై ఉన్న లోలెవల్ వంతెనపైకి సోమశిల వెనుక జలాలు చేరుతున్నాయి. సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా ప్రస్తుతం శుక్రవారానికి 69 టీఎంసీలకు చేరుకున్నాయి. పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోమశిల జలాశయంలోకి 22,258 కూసెక్కుల నీరు చేరుతోంది. దిగువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిగిలిన 10 వేల పైచిలుకు క్యూసెక్కుల నీరు జలాశయంలో చేరుతోంది. ఈ ఉధృతి ఇలాగే కొనసాగి అధికారులు ఇలాగే నీటిని నిల్వ చేస్తే మరో వారం రోజుల లోపే పూర్తి స్థాయి నీటి మట్టంకు చేరుతుంది. శుక్రవారానికి లోలెవల్ వంతెనపై అడుగు మేర నీరు పారుతోంది. ఇలా రెండు లేదా మూడు రోజులకు వేమలూరు వద్ద ఉన్న లోలెవల్ వంతెనపై నీటి ప్రవాహం పెరిగితే రాక పోకలు పూర్తిగా నిలిచి పోయే అవకాశం ఉంది.

40 కిలోమీటర్లు తిరిగి వెళ్లాలి

సగిలేరు లోలెవెల్ వంతెనపై నీరు చేరి రాకపోకలు నిలిచి పోతే అట్లూరులో ఉన్న తహశీల్దారు, ఎంపీడీఓ, వెలుగు, తదితర మండల కార్యాలయాలతో పాటు పోలీస్‌స్టేషన్, బ్యాంకులకు వెళ్లాలంటే సగిలేరు నదికి తూర్పు భాగాన ఉన్న ముత్తుకూరు, వేమలూరు, కామసముద్రం, మాడపూరు, మణ్యవారిపల్లి, కమలకూరు ఈ ఆరు పంచాయితీల పరిధిలోని సుమారు 30 గ్రామాల ప్రజలు ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న మండల కార్యాలయాలకు బద్వేలు మీదుగా 40 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది.

ఆరు పంచాయితీల ప్రజలకు అవస్థలు..

అట్లూరు మండల పరిధిలో 12 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. సగిలేరు నదికి తూర్పున ఆరు, పడమర దిక్కున ఆరు పంచాయితీలు ఉన్నాయి. లోలెవల్ వంతెన పై నీరు మూడు అడుగుల మేర చేరితే వాహన రాక పోకలు పూర్తిగా నిలిచి పోతాయి.

హై లెవల్ వంతెన నిర్మించాలి..



సోమశిల జలాశయంలో నీరు పూర్తి స్థాయిలో నిల్వ చేసిన ప్రతి సారి మాకు అవస్థలు తప్పడంలేదు. ఎక్కడెక్కడో కోట్లు వృధాగా ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. మా ఆరు పంచాయితీల ప్రజల అవస్థలు ప్రభుత్వాలకు కనిపించడంలేదు. ఇక నైనా సగిలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మించాలి.

- చిన్న మునిరెడ్డి, పెద్ద కామ సముద్రం, అట్లూరు మండలం

మా అవస్థలు ఇంతేనా?



ప్రతి సంవత్సరం సోమశిల ప్రాజెక్టుకు నీరు వచ్చినప్పుడల్లా సగిలేరు నదిపై ఉన్న వంతెన మునగడం.. మాకు రాక పోకలు నిలిచి పోవడం మామూలైంది. మా ఆరు పంచాయితీ గ్రామాల ప్రజలు అవస్థలు అధికారులకు పట్టడం లేదు. - సగిలి ఈశ్వర్‌రెడ్డి, కోనరాజుపల్లి, అట్లూరు మండలం

టెండర్లకు ఎవరూ రాలేదు...



ఆరు పంచాయితీల గ్రామాల ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టరు సుధా రెండేళ్ల క్రితం ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లి రూ.20 కోట్లు నిధులు కేటాయించేలా కృషి చేశారు. సర్వేకూడా చేయించారు. అయితే ఎక్కువ రోజులు నీరు ఉంటుందని.. ఇక్కడ వంతెన నిర్మాణానికి ఇబ్బంది కరంగా ఉంటుందని టెండర్లకు ఎవరూ ముందుకు రాలేదు. - ముదమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, అట్లూరు మండలం

● దీపావళి సంబరం





దీపావళి పండుగను గురువారం జిల్లా వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకూ టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. బాణసంచా వెలుగులతో ఆకాశం కొత్త కాంతులీనింది.

-సాక్షి ఫొటోగ్రాపర్, కడప

క్లుప్తంగా

అవినీతికి పాల్పడుతున్న అధికారిని సస్పెండ్ చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : ఐసీడీఎస్ పరిధిలోని కమలాపురం ప్రాజెక్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఈశ్వర్యను సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే శ్రీనివాసులు రెడ్డి, మనోహర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ డ్యూటీ కమలాపురం, నివాసం కడప, ఎప్పుడు చూసినా పీడీ ఆఫీసులో ఆయన ఉంటారని గుర్తు చేశారు. గతంలో ఈ విషయం కడప పీడీ దృష్టి తీసుకెళ్లామన్నారు ప్రశ్నించిన వారిని వేధింపులకు గురి చేస్తారన్నారు. ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

టపాసుల దుకాణాలపై దాడులు



దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలోని పలుప్రాంతాలల్లో టపాసుల దుకాణాలపై దాడులు చేసి కేసులు నమోదు చేసినట్లు తూనికల కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రవీంద్రారెడ్డి తెలిపారు. గురు, శుక్రవారం జిల్లాలోని కడప, బద్వేల్, పోరుమామిళ్ల ప్రాంతాలల్లో తూనికల కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు దుకాణాలలో ఎమ్మార్పీ, తయారీ తేదీ, తయారీ దారుని చిరునామా లేని అనేక టపాసులను గుర్తించామన్నారు. ఇది చట్ట రీత్యా నేరమని దుకాణం దారులకు తెలియజేస్తూ మొత్తం 20 కేసులు రాసి రూ.83 వేలు జరిమానా విధించామన్నారు. అందులో కొన్ని సీజ్ చేశామన్నారు. దాడుల్లో తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ వెగ్రి స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

ముద్దనూరు : మండలంలోని గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన శివాని(23) అనే యువతి అదృశ్యమైనట్లు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు.. శివానిని ఇంటి వద్ద ఉంచి ఆమె తల్లితండ్రులు పొలం పనులకు వెళ్లారు. తిరిగి తల్లిదండ్రులు సాయంత్రం ఇంటివచ్చి చూడగా కూతురు కనిపించలేదు. చుట్టుపక్కల విచారించినా సమాచారం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐటీఐ అభ్యర్థులకు ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐటీఐలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి అప్రెంటీస్‌షిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లాకు సంబంధించి డీజల్ మెకానిక్ 40, మోటారు మెకానిక్ 9, ఎలక్ట్రీషియన్ 5, వెల్డర్ 1, పెయింటర్ 1, మెషనిస్ట్ 5, ఫిట్టర్ 3, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ 1 కలిపి మొత్తం 65 ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే అన్నమయ్య జిల్లాకు సంబంధించి డీజల్ మెకానిక్ 36, మోటారు మెకానిక్ 5, ఎలక్ట్రీషియన్ 4, వెల్డర్ 1, పెయింటర్ 1, డ్రాఫ్ట్ మెన్ సివిల్ 1 కలిపి మొత్తం 48 ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు ఈనెల 5 నుంచి 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.అప్రెంటిస్‌షిప్ ఇండియా.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ కాపీల సెట్‌తో వెరిఫికేషన్ కోసం కర్నూలులోని జోనల్ సిబ్బంది ట్రైనింగ్ కళాశాలలో పత్రికా ముఖంగా తెలియజేసే తేదీలను బట్టి హాజరు కావాల్సి ఉంటుందన్నారు. వెరిఫికేషన్‌కు ఫీజు కింద రూ. 118 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

భారీ స్కోరు దిశగా అనంత జట్టు

ఉత్సాహంగా అండర్–14 క్రికెట్ పోటీలు



తలపడుతున్న కృష్ణ, శ్రీకాకుళం జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 మల్టీడేస్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో కేఎస్ఆర్ఎం మైదానంలో అనంతపురం, విజయనగరం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంత జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి అనంతపురం జట్టు 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 377 పరుగులు చేసింది. జట్టులోని టి. కిరణ్‌కుమార్ 109 పరుగులు, ప్రణధీర్ 79 పరుగులు, రోహిత్ రాయల్ 57 పరుగులు చేశాడు. విజయనగరం బౌలర్లు గౌతమ్ 2, విష్ణుష్ 2 వికెట్లు తీశారు.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో గుంటూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 49 ఓవర్లలో 164 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సాయియశ్వంత్ 39, కిన్ను కుశాల్ 37 పరుగులు చేశారు. గుంటూరు బౌలర్లు గోపీచంద్ 4, షాన్ 3, అబ్దుల్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 39 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 137 పరుగులు చేసింది. జట్టులోని కౌషిక్ 75 పరుగులు, అభినవ్ డేవిడ్ 33 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ సుశాంత్ 1 వికెట్ తీశారు. దీంతో తొలిరోజు మ్యాచ్ ముగిసింది.



కిరణ్‌కుమార్, అనంతపురం (109 పరుగులు)



ప్రణధీర్, అనంతపురం (79 పరుగులు)



కౌషిక్, గుంటూరు (75 పరుగులు)

వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో..

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ క్రికెట్ మైదానంలో కృష్ణ, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 60.1 ఓవర్లలో 115 పరుగుల వద్ద కృష్ణా జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని రిత్విక్ 29, హర్ష 25 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు సాత్విక్ 3, యోజిత్ 2, ఆదిత్య 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 34 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. జట్టులోని జోగేంద్ర 33, కిరణ్ 30 పరుగులు చేశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

నోటీసులతో భయభ్రాంతులకు గురిచేయడం తగదు



మాట్లాడుతున్న ఏపీ రాష్ట్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు

ప్రొద్దుటూరు : జగన్న కాలనీలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు అధికారులు నోటీసులు ఇచ్చి భయాభ్రాంతులకు గురి చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ గంజికుంట నాగరాజు తెలిపారు. శుక్రవారం ప్రొద్దుటూరులో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పేదలకు జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మించుకోని లబ్ధిదారుల నుంచి ఇళ్ల స్థలాలు వెనక్కి తీసుకుంటామని నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టే వారికి రూ.4లక్షలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు జగనన్న కాలనీలో ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందళనలను చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ప్రవీణ్ కుమార్, ఆదినారాయణ, షరీఫ్ పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి

● డీఆర్వో గంగాధర్‌గౌడ్



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: భిన్నత్వంలో ఏకత్వం, సమైక్యత, సౌభ్రాతృత్వాలకు ప్రతీకగా వెలుగొందుతున్న భరత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని పిలుపునివ్వడమే 'ఏక్తా దివస్' ముఖ్య ఉద్దేశ్యమని డీఆర్వో గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయి పటేల్ జయంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రాష్ట్రీయ 'ఏక్తా దివస్' కార్యక్రమంలో ఆయన సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ భారతదేశపు 'ఉక్కు మనిషి'గా ప్రపంచ దేశాలకు స్ఫూర్తిని ఇచ్చిన సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి రోజును.. భారత ప్రభుత్వం 'ఏక్తా దివస్' గా పరిగణించి ఆయనను స్మరించుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ముందుగా 'దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతానని, అంతేగాక ఈ సందేశాన్ని తోటివారందరిలో విస్తరింపచేయడానికి గట్టిగా కృషి చేస్తానని' సభకు హాజరైన వారందరి చేత డీఆర్ఓ ప్రతిజ్ఞ చేయించారు.

ఏపీజీబీ అవగాహన వారోత్సవాలు



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అవినీతికి వ్యతిరేకంగా అక్టోబరు 28 నుంచి నవంబరు 3వ తేది వరకు అవగాహన వారోత్సవాన్ని నిర్వహిస్తోందని బ్యాంకు చైర్మన్ సత్యప్రకాశ్ సింగ్ తెలిపారు. శుక్రవారం సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన ప్రధాన కార్యాలయ సిబ్బందిచేత అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలు, ఖాతాదారులు, యువత, విద్యార్థులను జాగృతం చేస్తామని ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ బ్యాంకు సిబ్బంది ప్రధాన కార్యాలయం నుంచి ఐటీఐ సర్కిల్ వరకు ఊరేగింపు నిర్వహించారు. ఇందులో భాగంగా బ్యాంకు పరిధిలోని తొమ్మిది ప్రాంతీయ కార్యాలయాల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, న్యాయమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. బ్యాంకు సేవలను కొనియాడారు. బ్యాంకు సీవీఓ, జనరల్ మేనేజర్ సంజీవప్ప కూడా మాట్లాడారు. ప్రధాన కార్యాలయ జనరల్‌మేనేజర్ పీఆర్ పడ్గేట్వర్, రాజేంద్రన్ గిరి, శ్రీనివాసప్రసాద్, ఆర్ఎం, చీఫ్ మేనేజర్లు, అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

సెల్ఫీ తీసుకుంటూ లోయలో పడి బాలుడి దుర్మరణం

పండుగ పూట విషాదం



పాలకొండ లోయలో పడి మృతి చెందిన మనోజ్

కడప అర్బన్ : సెల్ఫీ తీసుకుంటూ లోయలోపడి వీర వెంకటసాయి మనోజ్ (14) అనే బాలుడు మృత్యువాత పడ్డాడు. దీపావళి పండుగ రోజున కడపలోని మృత్యుంజయకుంటకు చెందిన మనోజ్, తన స్నేహితులతో కలిసి నగర శివార్లలోని పాలకొండలకు వెళ్లి సరదాగా ఈత కొట్టాడు. కొండపై నుంచి 60 అడుగుల కంటే ఎక్కువ వున్న లోయలో నీళ్ల పడుతున్నాయి. అక్కడ సెల్ఫీ తీసుకుంటున్న మనోజ్ కాలుజారి లోయలో పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న రిమ్స్ పీఎస్ ఎస్ఐ జయరాములు, కడప ఫైర్ స్టేషన్ ఆధికారి బసివిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. నీటి కుంటలో చిక్కుకుపోయిన మనోజ్‌ను బయటకు తీశారు. అప్పటికే మనోజ్ మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటనతో కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయరాములు తెలియజేశారు.

ఒక్కడే కొడుకు... నాలుగు రోజుల్లో పుట్టినరోజు..

కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి కొన్ని సంవత్సరాల కిందట బేల్దారి పని కోసం వచ్చి కడపలోని మృత్యుంజయ కుంటలోనే మనోజ్ తల్లిదండ్రులు విజయ్, వెంకటలక్ష్మిలు స్థిరపడ్డారు. దీపావళి పండుగ రోజున తల్లిదండ్రులు, అక్కలు ఇద్దరితో కలిసి ఆనందంగా గడిపాడు. వాళ్లతో వెళ్లి క్రాకర్స్ తెచ్చుకున్నాడు. సాయంత్రం వచ్చి వాటిని కాల్చుకుందామనుకున్నాడు. మధ్యాహ్నమే ఇద్దరు స్నేహితులతో కలిసి పాలకొండలకు వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయాడు. అలాగే ఈనెల 4వ తేదీనే పుట్టినరోజు కావడంతో పుట్టిన రోజుకు కూడా కొత్త దుస్తులను కొని తెచ్చారు. ఇంతలోనే ఈ సంఘటన చోటుచేసుకుందని తల్లిదండ్రులు, అక్కలు ఇద్దరు తీవ్రంగా విలపించారు. రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అంత్యక్రియల కోసం వారి స్వగ్రామానికి తీసుకుని వెళ్లారు.

ఆపరేషన్ వికటించి మహిళ మృతి

పీలేరు రూరల్ : ఆపరేషన్ వికటించి మహిళ మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణం ఎస్‌కేఆర్ హాస్పిటల్‌లో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన చింతపర్తి వెంకటరమణ భార్య లక్ష్మీదేవి (55) కడుపునొప్పితో బుధవారం ఎస్‌కేఆర్ హాస్పిటల్‌కు వెళ్లింది. పరిశీలించిన వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. అయితే పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు. అక్కడ ఓ ప్రైవేట్ హాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. దీంతో మృతురాలి బంధువులు గురువారం ఎస్‌కేఆర్ హాస్పిటల్‌కు మృతదేహంతో చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ విషయంపై హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎస్‌కే వసీంను వివరమణ కోరగా వైద్యం కోసం తమ ఆస్పత్రికి వచ్చిన లక్ష్మీదేవి పరిస్థితి కండీషన్ చాలా సీరియస్ ఉండడంతో ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతోనే ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఐవో ఉషశ్రీ, డెమో దేవశిరోమణి, వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి, తహసీల్దార్ భీమేశ్వర్‌రావు శుక్రవారం ఎస్‌కేఆర్ హాస్పిటల్‌ను సందర్శించి వివరాలు సేకరించారు. నివేదిక ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

కడప స్టీల్ ప్లాంటు నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలి

కడప సెవెన్‌రోడ్స్ : విభజన హామీలో భాగంగా కడప స్టీల్ ప్లాంటు నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలని ఉక్కు సాధన ఐక్య వేదిక అధ్యక్షుడు బి.నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనకాపల్లిలో జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్స్‌తో మిట్టల్ కలిసి జాయింట్ వెంచర్‌తో భారీ ఉకుక పరిశ్రమను నిర్మిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. కానీ, కడప స్టీల్ ప్లాంటును కేంద్ర ప్రభుత్వంతో నిర్మింపజేయడంలో రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి విఫలమైందని విమర్శించారు. సుమారు రూ. 70 వేల కోట్ల పెట్టుబడితో 20 మిలియన్ టన్నుల సామర్థ్యంతో, సుమారు 90 మందికి అనకాపల్లి స్టీల్‌ప్లాంటు ద్వారా ఉపాధి లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందన్నారు. అయితే నిరంతర కరువులతో అల్లాడుతూ ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్న రాయలసీమ ప్రజల అభివృద్ధికి ఉపయోగపడే కడప స్టీల్‌ప్లాంటు నిర్మాణానికి తిలోదకాలివ్వడం దారుణమన్నారు. అభివృద్ధి వికేంద్రీకరించి వెనుకబడిన ప్రాంతాలను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కడప స్టీల్ ప్లాంటు, కడప–బెంగుళూరు రైల్వేలైన్ పనులు, సాగు నీటి ప్రాజెక్టుల పరిపూర్తికి నవంబరు బడ్జెట్‌లో అధిక నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల మేనిఫెస్టో హామీలు అమలు చేయాలి

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున



మాట్లాడుతున్న మేకల శివార్జున

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని తమ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. దసరా, దీపావళి పండుగలు పోయినా ఐఆర్ ప్రకటనలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో తీవ్ర నిరాశ నెలకుందన్నారు. తెలంగాణలో దీపావళికి డీఏ ప్రకటించినా ఇక్కడ పెండింగ్ డీఏల పట్ల స్పందన లేకపోవడం అన్యాయం అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న అన్ని ఆర్థిక అంశాలను ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, గంగరాజు, జిల్లా కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య



ఉరి వేసుకుని మృతి చెందిన నవ్యశ్రీ

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీనివాస హాల్ థియేటర్ సమీపంలో ఉంటున్న నవ్యశ్రీ (21) అనే వివాహిత ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బంధువుల కథనం మేరకు.. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న మహేష్ కుమార్ స్టేట్ బ్యాంక్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి సత్యసాయి జిల్లా తలుపుల చెందిన నవ్యశ్రీతో దాదాపు 16 నెలల క్రితం వివాహమైంది. మహేష్ కుమార్ ఉద్యోగానికి వెళ్లడంతో ఎవరూలేని సమయం చూసి నవ్యశ్రీ చీరెతో ఉరి వేసుకుని మృతి చెందింది. మధ్యాహ్నం భోజనానికి వచ్చిన భర్త ఎంత సేపు తలుపు డోర్ కొట్టినా తీయకపోవడంతో ఇతరుల సహాయంతో తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. అయితే అప్పటికే నవ్యశ్రీ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ నారాయణ సంఘటనా స్థలానికి చేరుకునే మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నవ్య శ్రీ మృతికి కుటుంబ కలహాలా?ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనేది విచారణలో తేలాల్సి ఉంది.

అత్తింటి ముందు కోడలి ధర్నా





యువతితో వాగ్వాదానికి దిగిన యువకుడి కుటుంబ సభ్యులు, అంకాలమ్మ, గురునాథ్ (పెళ్లి ఫొటో)

వేంపల్లె : ఆరేళ్ల నుంచి ప్రేమించుకున్నారు. ఆపై ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లయిన ఆరు రోజులకే విభేదాలు వచ్చాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడి ఇంటి వద్ద ఆ యువతి ధర్నాకు దిగింది. కుటుంబ సభ్యులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు యువతిని పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. బాధితురాలు అంకాలమ్మ చెప్పిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన మల్లె అంకాలమ్మ, వేంపల్లెలోని గౌరి నగర్‌కు చెందిన పసుపులేటి వెంకట గురునాథ్‌లు ఆరేళ్లుగా నుంచి ప్రేమించుకున్నారు. గురునాథ్ బీటెక్, అంకాలమ్మ డిగ్రీ పూర్తి చేశారు. రెండేళ్ల నుంచి ఒకరికొకరు (రిలేషన్ షిప్) దగ్గర అయినట్లు అంకాలమ్మ తెలిపారు. అంకాలమ్మకు పెళ్లి చూపులు చూస్తుండటంతో.. గురునాథ్‌కు విషయం చెప్పింది. ఈ నేపథ్యంలో ఇద్దరు కలిసి అక్టోబర్ 26వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి బద్వేలు నియోజకవర్గంలోని ద్రాకా పేట శివాలయంలో వివాహం చేసుకున్నారు. తర్వాత వేంపల్లె పోలీస్ స్టేషన్‌కు వచ్చి విషయం చెప్పడంతో.. వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. గురునాథ్ తల్లిదండ్రులు తమ ఇంటికి రావద్దని చెప్పడంతో.. యువతి పిన్ని ఇంటికి ఇరువురు వెళ్లారు. మూడు రోజుల క్రితం గురునాథ్ దుస్తుల కోసం డబ్బులు అడిగితే.. యువతి పిన్ని వారు రూ.10 వేలు, బైకు ఇచ్చి పంపించారు. అయితే తిరిగి రాకపోవడంతో యువతి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లారు. యువకుడిని, యువతిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ చేసి.. మూడు రోజుల తర్వాత రావాలని పోలీసులు ఇంటికి పంపించారు. గురునాథ్ ఇక రాడేమోనని భావించి.. యువతి గురునాథ్ ఇంటి ముందు ధర్నాకు దిగింది. యువకుని తరపున బంధువులు యువతిపై చేయి చేసుకోవడంతో గొడవ పెద్దది అయ్యింది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి విచారణ చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERIVCES

డెంటల్ క్లినిక్ అమ్మబడును

■ Rajampeta DENTAL CLINIC for Sale 6 yrs old running clinic for sale Contact: 9908333081

WANTED

■ విజయవాడలో సంపన్నుల / పెద్దవారి ఇళ్ళ వద్దే ఉండి, పేషెంట్‌ని / Bed Ridden వారిని చూసుకొనుటకు అనుభవం గల కేర్ టేకర్స్ M/F నర్సులు, RMPలు కావలెను. 91608 35559, 98650 25559

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899

■ Wanted PRO's and Teaching Staff to work in a reputed School @ Tirupati, Contact Cell: 99084 83228, 98859 88668.

■ విజ్ఞాన్ తెలుగు దినపత్రిక & ఉదయవాణి TV ఛానెల్‌లో పనిచేయుటకు మండలాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను. ఫోన్ : 8317644367.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K -30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692.

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP -40 వేలు, ఫ్రీ రూమ్+ భోజనం. HYD. Ph: 8317512135

■ కావలెను.. కావలెను.. కావలెను.. కావలెను... శుభమస్తు షాపింగ్‌మాల్ ద్వారకానగర్, కడప నందు పని చేయుటకు ఫ్లోర్ సూపర్‌వైజర్‌లు, సేల్స్ మెన్స్, ఉమెన్స్, హెల్పర్స్, రిసీవర్స్ కావలెను. అర్హతను బట్టి జీతం ఇవ్వబడును. PF, ESI సౌకర్యం కలదు. కొత్త వారికి కూడా అవకాశం కలదు. వివరాల కొరకు కింది సెల్ నెంబర్‌లను సంప్రదించగలరు. సెల్ : 99894 14233 97057 38380.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక
[illegible]

పింఛన్ కోసం టెన్షన్



కడప 30వ డివిజన్ సచివాలయం వద్ద మధ్యాహ్నం 12.30 గంటలవుతున్నా పింఛన్ అందకపోవడంతో నిరీక్షిస్తున్న వృద్ధులు

సాక్షి నెట్‌వర్క్ : వైఎస్సార్ జిల్లాలో పండుటాకులు పింఛన్ల కోసం పడరాని పాట్లు పడ్డారు. శుక్రవారం సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టారు. అయితే చాలా మంది అవ్వాతాతలు పింఛన్ల కోసం సచివాలయాల వద్దకు వచ్చి పడిగాపులు కాచారు. ఏమని అడిగితే 'మా దగ్గరికి పింఛన్ ఇచ్చేవాళ్లెవరూ రాలేదు.. అందుకే ఇక్కడికి వచ్చాం' అని బదులిచ్చారు. కడప నగరంలో పలుచోట్ల మధ్యాహ్నం 12.30 దాటినా పింఛన్లు అందక లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడ్డారు. అలాగే బి.మఠం, సింహాద్రిపురం, లింగాల తదితర మండలాలవ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి సర్వర్ పనిచేయక పోవడంతో మధ్యాహ్నం వరకు వృద్ధులు ఆందోళన చెందాల్సి వచ్చింది. కొన్నిచోట్ల సాయంత్రం వరకు పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో వృద్ధులు, వికలాంగులు, పొలం పనులకు వెళ్లే లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. పనులకు వెళ్లకుండా ఇళ్ల వద్దనే ఉండి పింఛన్ తీసుకోవాల్సి వచ్చిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.వలంటీర్‌లు ఉన్నప్పుడు ఏ సమాచారమైనా క్షణాల్లో వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

అమరవీరుల సంస్మరణార్థం కొవ్వొత్తుల ర్యాలీ

సిద్దవటం : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు 2024 కార్యక్రమంలో భాగంగా ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పోలీసులు గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినట్లు బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంటు నాగేశ్వరప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ బెటాలియన్ పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలతో కలసి భాకరాపేట మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే గురువారం ఉదయం సిద్దవటం మండలం భాకరాపేటలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నుంచి బెటాలియన్ వరకు రన్ ఫర్ యూనిటీ జాతీయ సమైక్యతా పరుగు పందెంను ఇన్‌చార్జి కమాండెంటు నాగేశ్వరప్ప జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బెటాలియన్‌లో సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అందరితో జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేయించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంటు కమాండెంటు కె. వెంకట్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ ధ్యేయం



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్ : కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ ధ్యేయమని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం నగరంలో ఏఐటియూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాలల్లో జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. బ్రిటిష్ కాలంలో పోరాటాలు చేసి ప్రాణాలర్పించి సాధించుకున్న హక్కులను కాలరాయడం బీజేపీ మూర్ఖత్వపు విధానాలకు నిలువుటద్దమని అన్నారు. రాష్ట్రంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఆపాలని, తొలగించిన 4200 మంది కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆశాలకు వేతనాలు పెంచుతానని ఉద్యోగ భద్రత కల్పిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో. నాయకులు మద్దిలేటి, కేసీ బాదుల్లా, సుభాషిణి, వి విధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం తగదు

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ మరోపక్క కార్మిక హక్కులను కాలరాస్తే సహించేది లేదని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు రామలింగారెడ్డి, సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె. మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. గురువారం కడప నగరంలోని ప్రధాన విద్యుత్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ 105 ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అదనపు కార్యదర్శి కెసి బాదుల్లా, ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కృపాకర్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి, హరి కేశవరెడ్డి, రామకేశవ, నిత్యానంద రెడ్డి. స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పునరంకితం కావాలి – ఏఐటీయూసీ నేతల పిలుపు

కడప సెవెన్‌రోడ్స్ : దేశంలోనే మొట్టమొదటి కార్మిక సంఘంగా ఘనతకెక్కిన ఏఐటీయూసీ 105 సంవత్సరాలుగా కార్మికుల పక్షాన పోరాడుతూ అనేక చట్టాలను, సౌకర్యాలను సాధించి పెట్టిందని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ, రైల్వే గుడ్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కేసీ బాదుల్లా పేర్కొన్నారు. కడప రైల్వే స్టేషన్ ఆవరణలో యూనియన్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లింగన్న, నాయకులు హుసేన్, మేస్త్రి లు పాల్, చిన్న ఓబులేసు, నాగేంద్ర, గంగయ్య,మహబూబ్ బాష, రంగనాయకులు, మల్లిలు పాల్గొన్నారు.